# అమ్మ మనసు

బి. కృష్ణవేణి

అణుమల్లిపేటలోని ఆ వీధిలో ఉన్న ఇళ్లన్నింట్లోనూ టకటకమని మగ్గం చప్పుళ్లు వినిపిస్తున్నాయి. ఒక పూరింట్లో సాంబయ్య మగ్గం నేస్తుంటే, అతని భార్య సుజాత మగ్గానికున్న తాళ్లు లాగుతోంది. ఆమె ఒక్కో తాడు లాగినప్పుడల్లా జాకార్డు మిషనుకి అమర్చిన సిలిండరు తిరుగుతా ఉంది. ఆ సిలిండరుకి తగులుకున్న అట్టమీది బొక్కల్నిబట్టి కింద నైలాను దారాలు పైకి లేస్తా ఉన్నాయి. ఆ లేచిన దారాల లోపల్నించి సాంబయ్య 'బుటాలు' తీస్తున్నాడు. బుటాలంటే నేసే గుడ్డ మీదొచ్చే డిజైన్లు, ఇంట్లో ఆ భార్యాభర్తలు నేత పని చేస్తా ఉంటే ఆ ఇంటిముందు పిల్లకాయలు ఇసకలో ఆడుకుంటున్నారు. వాళ్లలో ఆ ఇంటి పిల్లకాయలే కాక చుట్టుపక్కల ఇళ్ల పిల్లకాయలు కూడా కొంతమందున్నారు. వాళ్లలో ఎనిమిదేళ్ల పిల్లకాయల నుంచి మూడేళ్ల పిల్లకాయల దాకా ఉన్నారు. పెద్ద పిల్లకాయలు గోలీలాట ఆడతా ఉంటే, మిగతా పిల్లకాయలు ఇసుకలో నీళ్లుపోసి, ఆ తడిసిన ఇసకతో ఏవేవో బొమ్మలు చేస్తా, వాటిని చెరిపేస్తా, మళ్లీ కొత్తవి చేస్తా, గొడవ గొడవగా ఆడతా ఉన్నారు. వాళ్ల వొళ్లులు తెల్లగా దుమ్ము కొట్టుకుపొయ్యాయి. మగ పిల్లకాయలెవరికీ వొంటి మీద చొక్కాల్లేవు. నిక్కర్లున్నాయి. ఆ నిక్కర్లన్నీ నల్లగా మసిపూసినట్లే కనిపిస్తున్నాయి మురికితో. ఇసుకలో ఆడుకుంటున్న చిన్న పిల్లకాయలు మధ్యమధ్యలో ఆ మురికి చేతుల్తోటే చీమిడి కారుతున్న ముక్కుల్ని తుడుచుకుంటున్నారు. దాంతో చీమిడీ, ఇసకా కలిసిపోయి వాళ్ల మొహాల మీద నల్లటి మరకలు తేలుతున్నాయి.



''రేయ్ పెద్దోడా ఇంకాడింది చాలుగానీ వొచ్చి బువ్వ తినండీ'' అని కేకేసింది సుజాత.

''కూచ్చేపు ఆడుకుని వొత్తామమ్మా'' అని అంతే గట్టిగా అరిచాడు ఆ పెద్దోడు.

''పొద్దున్నే పొళ్లు తోంకొని పొయ్యారు, పనీ పాటా లేకుండా, ఎప్పుడు పిల్చినా 'కూచ్చేపు...కూచ్చేపు' అంటా ఉంటావ్.


తొందరగా వొచ్చి బువ్వతింటే తొళ్లాగే పనుంది. నేను మళ్లా కండీలు చుట్టుకోవాల'' అంది సుజాత.

దాంతో ఆ ఇంటి పిల్లకాయలు ముగ్గురూ ఆటలాపి ఇంట్లోకెళ్లారు. వాళ్లు వెళ్లడం తోటే మిగతా పిల్లకాయలు కూడా ఎవరిళ్లకి వాళ్లు వెళ్ళి పొయ్యారు. సుజాత ముగ్గురు పిల్లకాయలు దొడ్లోకెళ్లి బక్కెట్లో తోడిపెట్టిన నీళ్లతో మొహాలు కడుక్కున్నారు.

ఈలోగా వాళ్ల ముగ్గురుకీ మూడు పళ్లేల్లో అన్నమేసి, పున్నీళ్లు పోసి కలిపింది సుజాత. అన్నంలో నంజుకోవ డానికి ఆవకాయ పెట్టింది. ఆ పిల్లకాయల్లో చిన్నోడికి మూడేళ్లు. ''అమ్మే. నాకు బువ్వపెట్టు'' అని సుజాత కొంగు పట్టుకుని లాగుతా గారాలు పొయ్యాడు.

''నా బుజ్జికన్నా కదా. అన్నోళ్లు చూడు యెట్టా బుద్దిగా తింటన్నారో, నువ్వూ అట్టాగే తిను. నాకు శానా పనుంది నాన్నా'' అని సుజాత చెప్పినా వినకుండా మారాం చేశాడు.

''అబ్బబ్బ చంపుతున్నావ్ కదరా'' అని విసుక్కుం టానే వాడికి అన్నం పెట్టింది. వాడు కుదురుగా తిన కుండా అమ్మ పెట్టిన ఒక ముద్ద నోట్లో వేసుకున్నాక అటూ ఇటూ లగెత్తుతున్నాడు. వాళ్లమ్మ మళ్లా గట్టిగా కేకేస్తే వొచ్చి మళ్లా ఒక ముద్ద పెట్టించు కుని నవ్వుతా మళ్లా లగెత్తుతున్నాడు. అట్లా సుజాతని అరగంట సేపు ఇబ్బంది పెట్టిమరీ వాడన్నం తిన్నాడు. ఆ సాయంకాలం పిల్ల కాయలు కోతికొమ్మచ్చి ఆడతా ఉంటే చీకటి పడింది. పౌర్ణం రోజులు కావటాన చంద



మామ తెల్లతెల్లగా మెరుస్తు న్నాడు. నేల మీద వెండి వెన్నెల పరుస్తున్నాడు. దాంతో పిల్లకాయలంతా కోతి కొమ్మచ్చి ఆపి 'వెన్నెలా-నీడ' ఆట మొదలు పెట్టారు. కొంచెం సేపయ్యాక అక్కడికి 'డబ్ డబ్.... డబ్ డబ్' మని పెద్ద చప్పుడు చేస్తా రాజ్‌దూత్ మోటార్ సైకిల్ వొచ్చి ఆగింది. ఆ బండిమీంచి ఇద్దరు భార్యాభర్తలు కిందికి దిగారు. వారిలో భార్య అక్కడ ఆడుకుంటున్న పిల్ల కాయలందర్నీ ఓసారి ఆరాగా చూసింది. మోటార్ సైకిల్ వొంకే చూస్తున్న మూడేళ్ల బుడ్డోణ్ణి చూసి ముచ్చట పడింది. వాణ్ణి పట్టుకుని ''నీ పేరేమిటి నాన్నా?'' అనడి గింది గోముగా.

వాడు భయంభయంగా ''మల్లికార్జున'' అన్నాడు.

''ఓ... మల్లికార్జునా.. బాగుంది పేరు'' అంటా నల్లగా మురికిపట్టిన వాడి బుగ్గని ముద్దు పెట్టుకుంది. అక్కడున్న పిల్లకాయలంతా ఆ భార్యాభర్తల వొంక అట్లానే ఆసక్తిగా చూస్తన్నారు. అప్పుడే మోటార్ సైకిల్ చప్పుడుకి ఇంట్లోంచి బయటికి వొచ్చిన సుజాత వాళ్లని చూసి, ''ఎవరూ... సామ్రాజ్యం వొదినా... మీరేనా... బాగున్నారా. రండి రండి. లోపలికి రండి'' అంటూ ఆహ్వానించింది.

''వీడెవడు, నీ కొడుకేనా? చాలా ముద్దుగున్నాడు'' అంది సామ్రాజ్యం బుడ్డోణ్ణి పట్టుకునే.

''అవునొదినా. మా చిన్నోడు'' అన్చెప్పింది సుజాత.

సామ్రాజ్యం. ఆమె భర్త మోహన్రావు... ఇద్దరూ ఇంట్లోకెళ్లారు. వాళ్లు కూర్చోడానికి నులకమంచం యేసింది సుజాత.

''యేమనుకోకండొదినా. మా ఇంట్లో కుర్చీల్లేవు'' అంది కొంచెం సిగ్గుపడ్తా.

''పర్లేదులే వొదినా'' అంటూ మంచం మీద కూర్చుంటూ, భర్తని కూడా కూర్చోమని సైగ చేసింది సామ్రాజ్యం. అతను కాస్త ఇబ్బంది పడ్తా కూర్చున్నాడు.

వాళ్ల ఎదురుగా సాంబయ్య మగ్గం నేస్తున్నాడు. మోహన్రావు చేసేది చేనేత వస్త్రాల ఎక్స్‌పోర్ట్ బిజినెస్సయినా ఎప్పుడూ మగ్గం గుంటకేసి పరీక్షగా చూసింది లేదు.

సామ్రాజ్యం పుట్టింది నేతగాళ్ల కుటుంబంలోనే. అయితే ఆమెకి తల్లివేపు నుంచి బాగా ఆస్తి కలసి రావడం తోటి బాగా చదూకుంది. కోటీశ్వరుల ఇంటి కోడలైంది. సుజాత తండ్రి సామ్రాజ్యానికి వరసకి మావయ్యవు తాడు. సామ్రాజ్యం వాళ్లుండేది మద్రాసులో. ఈ ఊళ్లో మోహన్రావుకి రెండు ఇళ్లున్నాయి. అర్నెల్ల కోసారో, లేదంటే ఏవైనా పెళ్ళిళ్లవంటి కార్యక్రమాలకో వొచ్చి కొన్ని రోజులుండి పోతుంటారు ఆ ఇద్దరూ. అట్లావొచ్చిన సామ్రాజ్యం తన బంధువుల్నోసారి పలకరిద్దామని ఇట్లా వొచ్చింది.

''ఏం సుజాతొదినా. నేత పనులు ఎట్లా సాగుతు న్నాయ్?'' అనడిగింది.

''ఏం పనుల్లే వొదినా. ఏం చెప్పమంటావ్? సంసారం నడవడానిక్కూడా కష్టంగా ఉంది. షావుకార్లు కూలీలు బాగా తక్కువిస్తన్నారని సొంతంగా నేసుకుం టున్నా పరిస్థితి ఏం బాలేదు. నూలు రేట్లూ, పట్టు రేట్లూ బాగా పెరిగిపోయాయి.

చీరల రేట్లేమో అట్లాగే ఉండే. ఆ షాపులోళ్లు మాకాడ తక్కువ రేటుకి కొని ఎక్కువ రేటుకి అమ్ముకుంటున్నారు.

గిట్టుబాటవ్వడం లేదని రేటెక్కువ ఇయ్యమని కాస్త గట్టిగా అడిగితే 'నువ్వు కాకపోతే ఇంకోళ్లు' అని చీరలు తీస్కోవడం లేదు. నూలు, పట్టు కొనడానికి చేసిన అప్పులు తీర్చేలోగానే వడ్డీలు పెరిగిపోతన్నాయ్. ఆ మధ్యే పదేలు అప్పుతెస్తే వడ్డీ పదకొండేలయ్యింది. కట్టాలంటే ఏడు పొక్కటే తక్కువ'' అంటూ నిట్టూర్చింది సుజాత.

''ఇంత కష్టమైనప్పుడు ఈ పని మానేసి ఇంకేదైనా పని చూసుకోవచ్చు కదా. చిన్నవ్యాపారం ఏదన్నా చేసు కోవచ్చు కదా'' అంది సామ్రాజ్యం.

''ఈ పని తప్ప మాకింకో పని తెలీదండి. చచ్చినా, బతికినా ఈ మగ్గం గుంటలోనే'' చెప్పాడు సాంబయ్య 'వాటు' వేసి, 'పలకొ' లాగుతా. అతను వాటువేస్తా

వుంటే కండె గుచ్చిన నాడి అటూ ఇటూ లగెత్తుతోంది.

"అదీ వొదినా. మా ఇంటి మగోళ్ల వరస. నీకు తెల్వ నిదా. నేనెప్పుడో చెప్పి చూశా. చిన్నకిరాణ కొట్టులాం టిది పెట్టుకుందామని. అస్సలు పడ నియ్యడు. మన లాంటోళ్లకి అట్టాంటివి సరిపడవని నా నోరు నొక్కుతా ఉంటాడు.... సరే కానీ వొదినా. మీ సంగతులేంది? యెట్టా ఉన్నారు? ఎంతకాలమైంది నిన్ను చూసి. పిల్లల్ని తీస్కురాక పోయారా?" అడిగింది సుజాత.

దాంతో సామ్రాజ్యం మొహంలో లీలగా బాధ తొంగి చూసింది. అది గమనించిన మోహన్రావు భార్య భుజం తట్టాడు ఓదార్పుగా.

"మేం బానే ఉన్నాం వొదినా. కానీ వొక్కటే దిగులు. నీతో పాటే నా పెళ్లీ అయ్యింది కదా. అంటే పదేళ్లు దాటి పోయింది. కానీ కడుపులో నలుసుకు నోచుకోలేక పొయ్యా" అంటుంటే సామ్రాజ్యం గొంతు వొణికింది.

"అయ్యో. అలాగా. దిగులు పడమాకు వొదినా. ఇప్పుడు కాకపోతే రేపైనా పుట్టకపోతారా" సానుభూతిగా అంది సుజాత.

"ఆ ఆశే ఉంటే ఇంక బాధెందుకొదినా. నాకు ఆ భాగ్యం లేదు. గర్భసంచిలో ఏదో తేడా ఉందంట. అందుకని నాకు పిల్లలు పుట్టే అవకాశం లేదని డాక్టర్లు చెప్పారు" చెబుతుంటే సామ్రాజ్యం కళ్లల్లో నీళ్లు.

"ఊరుకో సామూ. ఎమోషనల్ అవ్వొద్దని ముందే చెప్పానా. ఏమిటిది?" అనునయంగా అంటూనే చిరు కోపం చూపించాడు మోహన్రావు.

కళ్లు తుడుచుకుంది సామ్రాజ్యం. "నువ్వు నాకో సాయం చేయాలొదినా" అంది సుజాతతో.

"చెప్పొదినా. ఏంటది?"

"నువ్వా సాయం చేస్తే నీకేం కావాలంటే అదిస్తా"

"అంత పెద్ద సాయమా? పేదోళ్లం ఏదో చిన్నసాయమే కానీ పెద్దపెద్ద సాయాలు మేం ఏం చేస్తాం వొదినా?"

"అట్లా అనకొదినా. నువ్వు తలచుకుంటే అది చెయ్య గలవ్. అది నీ చేతుల్లోనే ఉంది".

"నా చేతుల్లో ఉందా. అయితే అదేంటో చెప్పొదినా".

భర్త చెయ్యి గట్టిగా పట్టుకుని "మీ చిన్నబ్బాయిని నాకివ్వగలవా?" అనడిగింది సామ్రాజ్యం.

మగ్గం గుంటలో ఉన్న సాంబయ్య టక్కున వాటు వెయ్యడం ఆపాడు. తానేం విన్నదో అర్ధంకానట్లు అయోమయంగా సామ్రాజ్యం వొంక చూసింది సుజాత. "ఏమంటున్నావ్ వొదినా?" అంది ఆశ్చర్యపోతా.

"మీ చిన్నబ్బాయినిస్తే మేం పెంచుకుంటాం వొదినా. వాడికి ఏ లోటూ రాకుండా మేం చూసుకుంటాం"

"ఏం వొదినా. ఆట పట్టిస్తున్నావా?"

"నే చెబుతున్నది నిజం వొదినా".

"మేం పేదోళ్లమే కానీ కన్నబిడ్డల్ని పెంచుకోలేనంత ఇదిలో మాత్రం లేమొదినా. మా ముగ్గురు పిల్లలూ మాకు బంగారు తండ్రులే. వాళ్లని ఎవరికో ఇచ్చుకునే ఉద్దేశం మాకు లేదు. మాకు తిండి లేకపోయినా పిల్లల తిండికి లోటు రానియ్యం" సుజాత గొంతులోని ఆవేశం అర్ధమైంది సామ్రాజ్యానికి.

"అడిగానని ఆవేశపడకొదినా. ఆలోచించు. నేను ఊరకే తీసుకెళ్తానని చెప్పడం లేదు. వాణ్ణి దత్తత తీసుకుంటాం. మా బిడ్డగా పెంచుకుంటాం. మంచి చదువులు చెప్పిస్తాం. రేప్పొద్దున వాడు మా బిజినెస్ చూసుకోవడమో లేదంటే పెద్ద ఉద్యోగమో చేస్తాడు. వాడి బతుకు బాగు పడుతుంది. అంతేకాదు. వాణ్ణి మాకు దత్తతిస్తే నీ మిగతా ఇద్దరు పిల్లలకీ మేమే చదువు చెప్పిస్తాం. వాళ్ల బతుకులూ బాగుపడతాయ్. ఆ తర్వాత మీక్కూడా ఏ కష్టాలు ఉండవు" అని సుజాత మొహంలోకి చూసింది సామ్రాజ్యం.

సుజాత మగ్గం గుంటలో ఉన్న సాంబయ్య వొంక చూసింది. అతనూ ఆమె వొంకే చూస్తున్నాడు.

"నువ్వు చెప్పేది బానేఉంది కానీ నా బిడ్డని వొదిలి నేనెట్లా ఉండగల నొదినా. ఆణ్ణి నేను కాకుండా ఇంకోరు పెంచడమనే ఊహే నాకు శానా కష్టంగా ఉంది. మా బిడ్డలు మాకు భారమని మేమెప్పుడూ అనుకోలేదు. మాకు చేతనైనంతలో ఆళ్లని బానే చూసుకుంటున్నాం. బడికి పంపిస్తన్నాం. రెక్కలు ముక్కలు చేసుకునైనా ఆళ్లని చదివిచ్చుకుంటాం. అంతేకానీ నా బిడ్డని ఇవ్వలేనొదినా" తేల్చి చెప్పేసింది సుజాత.

ఆమె మాటలు సామ్రాజ్యాన్ని నిరాశలో ముంచేశాయి. అది గ్రహించి ఆమె భుజంమీద చేయివేసి ధైర్యం చెప్పాడు మోహన్రావు. మొదటి సారిగా నోరు విప్పాడు. "చూడండమ్మా. అంత తొందరేం లేదు. మీ బాబుని మాకు దత్తత ఇస్తే వెంటనే మీకు లక్ష రూపాయలు ఇస్తాం. దాంతో మీ అప్పులన్నీ తీరిపోతాయి. ఇప్పట్నించే ఎట్లాంటి బాదరబందీ లేకుండా మీరు హాయిగా పని చేసుకోవచ్చు. ఓ వారం తర్వాత మేం మళ్లీ వొస్తాం. అప్పుడు మీ నిర్ణయం చెప్పండి" అన్నాడు. సుజాత ఏం మాట్లాడలేదు. భార్యాభర్తలిద్దరూ వెళ్లిపోయారు.

చెప్పినట్లే వారం తర్వాత మళ్లీ వొచ్చారు. సాయంత్రం పూట. ఈసారి మోహన్రావు చేతిలో సూట్ కేసు. నవ్వుతా సుజాత ఆహ్వానించే సరికి సామ్రాజ్యం మొహంలో కళవొచ్చింది. తన పని అయిపోయినట్లేనని అనుకుంది మనసులో. సుజాత చిన్నకొడుకు మల్లికార్జునని దగ్గరకు తీసుకుని వాడి బుగ్గని ముద్దు పెట్టుకుంది.

వాడు సిగ్గుపడతా ఆమెని వొదిలించుకుని బయటికి పరిగెత్తాడు. పోతున్న వాడివొంకే చూస్తా "ఏం వొదినా ఏం ఆలోచించారు?" అడిగింది సామ్రాజ్యం.

సుజాత నవ్వు మొహం తోటే "చెప్పేదేముంది వొదినా. నీ మాట మన్నించలేక పోతున్నా. మా చిన్నోణ్ణి..... వాణ్ణే కాదు నా బిడ్డలనెవర్నీ ఇవ్వలేను. ఆ సంగతి తప్ప వేరే సంగతులు మాట్లాడుకుందాం" అంది.

సామ్రాజ్యం మొహం నల్లనయ్యింది. తప్పకుండా 'లక్ష రూపాయలు' అనేది వాళ్ల మనసుల్ని మారుస్తుందనీ, అంత డబ్బిస్తామంటే తప్పకుండా ఒప్పుకుని, పిల్లవాణ్ణి అప్పగిస్తారనీ ఆమెకి అంతదాకా నమ్మకం ఉండింది. ఆ నమ్మకం పుటుక్కున తెగిపోతుందని ఆమె అనుకోలేదు.


"మీ కుటుంబం, మీ పిల్లల భవిష్యత్తును చేతులారా అడ్డుకుంటారా వొదినా. ఈ అవకాశమే ఇంకెవరికైనా వొస్తే కళ్లకద్దుకుని వొప్పుకుంటారు. మీవోడు నాకు బాగా నచ్చాడు. వాణ్ణి చూస్తే నా తల్లిపేగు కదిలింది. అందుకే వాణ్ణి పెంచుకోవాలనుకున్నా. నీకు వాడొక్కడే కాదు కదా. ఇంకా ఇద్దరు కొడుకులున్నారు కదా. నా బాధను అర్ధం చేసుకో వొదినా" అంది సామ్రాజ్యం కాస్త ఆవేదనగా.

ఆమె బాధని చూస్తుంటే సుజాతకీ బాధనిపించింది. కానీ తనేం చెయ్య గలదు? అది ఆమె దురదృష్టం. "వొదినా. నీ బాధని అర్ధం చేసుకోలేదను కుంటున్నావా? నాకు తెలుసు పిల్లల లేకపోతే ఆ బాధ ఎట్లా ఉంటుందో. కానీ నేను నవమాసాలూ మోసి కన్నబిడ్డని నీకెట్లా ఇచ్చేది. బిడ్డంటే వొస్తువు కాదు కదా ఇచ్చేయడాన్కి, అమ్ముకోడాన్కి. నాకు ముగ్గురు కాదు పదిమంది పిల్లలున్నా ఇదే మాటంటా. ఎందుకంటే ఆళ్లు నా పిల్లలు కాబట్టి, నేను ఆళ్ల కన్న తల్లిని కాబట్టి, డబ్బుల్లో పెరిగితేనే నా పిల్లల భవిష్యత్తు బాగుంటదని నేననుకోవట్లా. ఎంతమంది మట్టిలో మాణిక్యాలు రావడంలేదు. మా పిల్లల భవిష్యత్తు మేం చూసుకో గలమన్న నమ్మకముంది. మాకు మా అనుబంధాలు ముఖ్యం. ఆటికంటే మాకు డబ్బు ముఖ్యం కాదు" అంది సుజాత. అప్పుడామే జీవితాన్ని బాగా చదివిన గొప్ప నిష్ణాతురాలుమల్లే అవుపించింది సామ్రాజ్యానికి. కాసేపు ఉండి మల్లికార్జున వొంక ఓసారి చూసి భారంగా వెళ్లిపోయింది భర్తని వెంట పెట్టుకుని.

"నువ్వు నిజంగా సుజాతవే. ఎంత చక్కగా చెప్పావు. నేనైతే అట్లా విడమర్చి చెప్పగలిగేవోణ్ని కాదు" అంటూ భార్యని మెచ్చుకున్నాడు సాంబయ్య.


కొద్దిరోజుల తర్వాత వాళ్లకి తెలిసింది. సామ్రాజ్యం వాళ్లు దేశాయి పేటలోని అనాథ శరణాలయం నుంచి ఓ రెండేళ్ల బాబుని దత్తత తీసుకున్నారని తేలికపడింది సుజాత మనసు.

*



## బుక్ చాట్

# ఆంధ్రలో స్వాతంత్ర్యోద్యమ చరిత్ర



ఎందరో వీరుల త్యాగఫలంతో మనకు ఆంగ్లేయుల నుంచి స్వాతంత్ర్యం లభించిందనే విషయం తెలుసు. అయితే అలాంటి విప్లవ వీరులు, త్యాగమూర్తులలో మన తెలుగువారెంత మంది అనేది చాలామందికి తెలీని విషయం. దీనిపై మూడేళ్లపాటు విషయ సేకరరణ చేసి, ఆనాటి కేసులకు సంబంధించిన తీర్పులను సంపాదించి 'వందేమాతరం నుంచి క్విట్ ఇండియా : ఆంధ్రలో కేసులు-శిక్షలు' పేరిట పుస్తకంగా తెచ్చారు సి.వి. రాజగోపాల రావు. ఇప్పటికి 103 సంవత్సరాల క్రితం జరిగిన 'వందేమాతరం' ఉద్యమంలో రాజమండ్రి కాలేజీ విద్యార్థుల పాత్ర, వారికి పడ్డ రాజకీయ శిక్షలు చిన్నపరెడ్డికి విధించిన మరణ శిక్ష, ఉస్మానియా యూనివర్శిటీలో వేయిమందికి పైగా విద్యార్థులకు ఉద్వాసన పలకడంతో మొదలు పెట్టి 67 ఏళ్ల క్రితం నాటి 'క్విట్ ఇండియా' ఉద్యమంలో జగ్గయ్యపేట బాంబు కేసు, ఒంగోలు బాంబు కేసు, 'అనంత' విద్యార్థులపై కేసు.. మొత్తం 24 కేసుల గురించిన సమాచారాన్ని ఈ పుస్తకంలో పొందుపరిచారు. ఇందులో 18 కేసులకు సంబంధించిన కోర్టు తీర్పు కాపీలను యధాతథంగా అందించారు. 1907 నుంచి 1947 వరకు 40 సంవత్సరాల పాటు స్వాతంత్ర్యం కోసం పలు ఉద్యమాలు జరిగాయి. వీటికి సంబంధించి 'వందేమాతరం కేసులు, విప్లవం కేసులు, ఉద్యమాల కేసులు, రాజద్రోహ నేరం కేసులు, అధికారులపై కేసులు, కుట్రకేసులు, క్విట్ ఇండియా కేసులు' పేరిట విభజించి వాటికింద నమోదైన 24 కేసులను రచయిత అందించారు.

స్వాతంత్ర్యం కోసం పోరాడే వారిపై కేసులను పెట్టి జైలు పాలు చేస్తే, ప్రజలు భయభ్రాంతులవుతారని ఉద్యమం నీరుగారుతుందని ఆనాటి ప్రభుత్వం భావించింది. అయితే ఇవేవీ ప్రజలలో కానీ, నాయకులలో కానీ ఉద్యమ స్ఫూర్తిని తగ్గించలేదు సరికదా మరింతగా పెంచాయి. 1922-23 ప్రాంతంలో కాకినాడలో 'మాకొద్దీ తెల్లదొరతనము' పాట పాడుతూ ప్రజలను ఉత్తేజ పరుస్తున్న గరిమెళ్ల సత్యనారాయణ రాజద్రోహ నేరం కింద అరెస్టయ్యాడు. 1938లో 'వందేమాతరం' గీతం ఆలపించినందుకు ఉస్మానియా యూనివర్శిటీ విద్యార్థులను వేయి మందికి పైగా ఇళ్లకు పంపించి వేశారు. ఈ శిక్షకు గురైన వారిలో పి.వి.నరసింహారావు కూడా ఉన్నారు. 1907లో రాజమండ్రిలో 'వందేమాతరం' బ్యాడ్జితో కాలేజికి వెళ్లిన 110మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. అయితే అల్లూరి సీతారామ రాజు పట్ల చరిత్రకారులు నిర్లక్ష్యం చేశారని రచయిత ఆవేదన వ్యక్తం చేశారు. మన్యం ప్రాంతంలో ప్రజలను కూడగట్టి రెండు సంవత్సరాల పాటు ఆంగ్లేయులతో యుద్ధం చేసిన అల్లూరికి, భగత్‌సింగ్‌కు వచ్చినంత పేరు ఎందుకు రాలేదని ఆయన ప్రశ్నిస్తున్నారు. ఆంధ్రాలో స్వాతంత్ర్యోద్యమ చరిత్రను తెలుసుకోవాలనుకునే వారికి ఈ పుస్తకం కరదీపిక లాంటిది.

వందేమాతరం నుంచి క్విట్ ఇండియా :
ఆంధ్రలో కేసులు - శిక్షలు
-సి.వి.రాజగోపాలరావు
**పేజీలు : 404, వెల : రూ. 300**
ప్రతులకు : రచయిత పేర
**303, నేదునూరి మాన్షన్, 2-2-647/77/జి5**
యస్.బి.ఐ.కాలనీ, బాగ్ అంబర్‌పేట
**హైదరాబాద్ - 500013.**

# జ్ఞాపకాల హరివిల్లులు




"నాన్నగారికి నలుగురూ ఆడపిల్లలమే. చాలామంది ఒక్క ఆడపిల్ల ఉంటేనే అమ్మో అనుకుంటారు. కానీ, నాన్న ఎప్పుడూ అలా భావించలేదు. 'నాన్నగారూ' అని పిలిపించుకోవడం ఆయనకు ఇష్టం లేదు. తండ్రికీ, పిల్లలకూ మధ్య ఉండాల్సింది చనువు తప్ప, భయభక్తులు కాదనేది ఆయన నమ్మిక. ఒకసారి ఎవరో ఇంటికి వచ్చినప్పుడు నాన్నని - ఏమండీ మీకు మగపిల్లాడు లేడని బాధగా లేదా అని అడిగినప్పుడు.. ఆడా మగా తేడా ఏముందండీ.. వాళ్లని నేను మగపిల్లల మాదిరిగానే పెంచాను.. అన్నారు. ఇదేదో ఆయన మాటవరసకన్నది కాదు.. అక్షరసత్యం. ఇప్పటికీ చాలామంది తల్లిదండ్రులు చేయలేకపోతున్నది మా నాన్నగారు నాలుగున్నర దశాబ్దాల కిందటే చేశారు. మీరు లోపలికెళ్లండి.. వంట చేయండి.. ఇంటిపని చూడండి.. అనెప్పుడూ ఆయన అనలేదు.. సరికదా అమ్మని అననివ్వలేదు. కావలసినంత స్వేచ్ఛనిచ్చారు. ఆయన నమ్మకాన్ని మేమెప్పుడూ వమ్ము చేయలేదు. ఆయనకి డబ్బుల్ని కనిపించకుండా దాచటం అలవాటు లేదు. ఇంట్లో వారికి కనిపించేలా ఓ పెట్టెలో ఉంచేవారు. అవసరం మేరకు తీసుకొని వాడుకోవడమే. ఎంత తీశార ని అడిగేవారు కాదు. ఓసారి ఆయన్నడిగాం ఈ విషయాన్నే.. దానికాయన నవ్వి మిమ్మల్ని అనుమానిస్తే నన్ను నేను అనుమానించుకున్నట్లే.. అన్నారు'' రామాయణ, భారత, భాగవతాలు రాసిన ఉషశ్రీ గురించి ఆయన కుమార్తె జయంతి చెప్పిన విషయాలు ఇవి.

కీర్తిశేషులైన అరవై రెండుమంది సాహితీ ప్రముఖుల జీవిత విధానాలు వారి పిల్లలు చెబితే 'మా నాన్నగారు' పేరిట పుస్తకంగా తెచ్చారు డా.ద్వా.నా.శాస్త్రి. సృష్టికి మూలం తల్లి, తండ్రి. అయితే వీరిలో 'అమ్మ' పైన చాలా పుస్తకాలు వచ్చాయి కానీ 'నాన్న' పైన దాదాపుగా రాలేదనే చెప్పవచ్చు. ఇప్పుడు ఈ పుస్తకం అంతా నాన్నగురించే! ఇందులో వేటూరి ప్రభాకరశాస్త్రి, రాయప్రోలు సుబ్బారావు, గుర్రంజాషువా, పింగళి లక్ష్మీకాంతం, దేవులపల్లి కృష్ణశాస్త్రి, నార్ల వెంకటేశ్వరరావు, కొడవటిగంటి కుటుంబరావు, తిరుమల రామచంద్ర, రావిశాస్త్రి, దాశరథి కృష్ణమాచార్య తదితర ప్రముఖ సాహిత్య వేత్తల జీవితాలను వారి పిల్లలు వివరించారు. సాహిత్యాన్ని అధ్యయనం చేసేవారికి, సమాజాన్ని, కుటుంబాన్ని అర్థం చేసుకోవాలనుకునే వారికి ఈ పుస్తకం అత్యావసరం.

-సుంకోజి

మా నాన్నగారు
కీర్తిశేషులైన అరవైరెండుమంది
సాహితీ ప్రముఖుల జీవిత విధానాలు
డా.ద్వా.నా.శాస్త్రి
**పేజీలు : 379, వెల : 400**
ప్రతులకు : విశాలాంధ్ర వారి అన్ని దుకాణాలు